క్లుప్తంగా

యువతకు స్ఫూర్తి వివేకానందుడు



స్వామి వివేకానంద విగ్రహానికి నివాళి అర్పిస్తున్న విక్రంరెడ్డి తదితరులు

మీర్‌పేట: యువతకు స్ఫూర్తి వివేకానందుడు అని మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి అన్నారు. శుక్రవారం లలితానగర్ చౌరస్తాలో మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌యాదవ్ ఆధ్వర్యంలో వివేకానందుడి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అర్కల భూపాల్‌రెడ్డి, సిద్దాల బీరప్ప, బొక్క రాజేందర్‌రెడ్డి, నాయకులు దీప్‌లాల్‌చౌహాన్, రాజ్‌కుమార్, రమేశ్, లక్ష్మణ్, యాదగిరి ముదిరాజ్ పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి

ఎంపీడీఓ శైలజ



పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: నూతనంగా ఏర్పడిన గంగారం గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎంపీడీఓ శైలజ అన్నారు. శుక్రవారం మహేశ్వరం మండలం గంగారం గ్రామంలో ఎన్ఆర్‌జీఈఎస్ నిధులు రూ.20 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణానికి ఆమె గ్రామస్తులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభించామని, క్రమంగా డ్వాక్రా, అంగన్‌వాడీ, ఎస్సీ,ఎస్టీ,బీసీ కమ్యూనిటీ భవనాలు, గ్రామ రెవెన్యూ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ వర ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి నవీన్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మునావత్ పాండు నాయక్, ఎం.దేవేందర్ నాయక్, సూర్య నాయక్, రవినాయక్, దేవా నాయక్, బీఆర్ఎస్ నాయకులు రవినాయక్ పలువురు పాల్గొన్నారు.

దశలవారీగా పనులు చేపడతాం



అధికారులతో కలిసి కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: దశల వారీగా ప్రతి కాలనీలో అభివృద్ధి పనులు చేపడతామని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. శుక్రవారం జాతీయ కార్యాచరణలో భాగంగా విజయపురికాలనీలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు, సంబంధిత విభాగాల ఉద్యోగులతో కలిసి ఆమె పర్యటించారు. స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం పారిశుద్ధ్య సమస్యలను త్వరగా పరిష్కరించాలని, రోడ్ల మరమ్మతు పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ చందన, వర్క్ ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య, ఏఈ ప్రశాంతి, జలమండలి మేనేజర్ సంతోష్‌లు ఉన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



రాంచందర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్‌రావును శుక్రవారం షాద్‌నగర్ బీజేపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య ఆధ్వర్యంలో పలువురు నాయకులు నగరంలోని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి నివాసానికి వెళ్లి ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిభూషణ్, కుర్మయ్య, ప్రశాంత్, రఘురాములు, శ్రీను, నర్సింహ, పద్మ, కృష్ణయ్య, విజయ్‌శంకర్ రెడ్డి, రవి నాయక్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీతో సాగు.. ఆదాయం బాగు

మూడేళ్లు శ్రమిస్తే, మూడు దశాబ్దాలు సిరులు కురిపించే ఆయిల్ పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం, వ్యవసాయ అధికారుల అవగాహనతో .. కష్టనష్టాలను మిగుల్చుతున్న సంప్రదాయపంటలకు స్వస్తి పలికి, అధిక ఆదాయం వచ్చే పంటపై మరింతమంది మక్కువ చూపుతున్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

- ఒక్కసారి నాటితే 30 ఏళ్లు సిరుల పంట
- భారీ సబ్సిడీతో మొక్కలు, డ్రిప్ పరికరాలు అందజేస్తున్న ప్రభుత్వం
- అవగాహన కల్పిస్తున్న ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు
- సాగుపై ఆసక్తి చూపుతున్న అన్నదాతలు



ఆయిల్ పామ్ తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

మహేశ్వరం: ఆయిల్ పామ్ సాగుతో ఎలాంటి సమస్యలు ఉండవని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు పేర్కొంటున్నారు. మూడు సంత్సరాలు మొక్కలను జాగ్రత్తగా పెంచితే.. ముప్పై ఏళ్లు ఏటా ఎకరానికి రూ.2 లక్షల ఆదాయం పొందవచ్చని అవగాహన కల్పిస్తున్నారు. తొలుత మూడేళ్లు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని చెబుతున్నారు. ఆయిల్ పామ్ సాగు భూముల్లో అంతర పంటలను పండిస్తూ మరింత ఆదాయం పొందవచ్చని వివరిస్తున్నారు. దీంతో ఉద్యాన పంటలను సాగు చేసేందుకు అన్నదాతలు ముందుకు వస్తున్నారు.

ఎకరాకు 57 మొక్కలు

ఆయిల్ పామ్ మొక్క ఒక్కటి రూ.200లు ఉండగా, రైతులకు ప్రభుత్వం 90 శాతం రాయితీతో రూ.20లకే అందజేస్తోంది. ఎకరాకు 57 మొక్కలు అవసరం ఉండగా.. వీటి విషయంలో సబ్సిడీకి ఎలాంటి పరిమితి లేదు. పామ్ రైతులకు డ్రిప్ రాయితీ 12.5 ఎకరాలకు పరిమితం చేసింది. ఎస్సీ,ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీని అందిస్తోంది. యూనిట్ ధరపై 12 శాతం జీఎస్టీని రైతులు చెల్లించాలి. ఓసీ, బీసీ రైతులకు 80-90 శాతం రాయితీ ఉంటుంది. ఆయిల్ మొక్కలు నాటుకున్న రైతులకు ఎకరానికి రూ.4,200 చొప్పున 4 సంవత్సరాల పాటు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. నాలుగో ఏట నుంచి దిగుబడి మొదలవుతుంది.

డిమాండ్ ఉన్న పంటలనే..

ఆయిల్ పామ్ సాగు, యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ, ఉద్యాన వాఖ అధికారులు రైతులకు.. రైతు వేదికల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. పంటల సాగుపై, పంటల మార్పిడి విధానంపై సవివరంగా చెబుతున్నారు. సంప్రదాయ పంటలు కాకుండా, మార్కెట్లో డిమాండ్ ఉన్న వాటినే సాగు చేయాలని సూచిస్తున్నారు. పామ్ సాగుపై ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని పేర్కొంటున్నారు.

అంతర పంటలతో మరింత మేలు

ఆయిల్ పామ్ సాగు చేసే వారు అదనపు ఆదాయాన్ని పొందేందుకు మంచి అవకాశాలున్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ సాగు మధ్యలో కూరగాయలు, మక్కలు, పల్లి, పత్తి, బొప్పాయి, సోయాబీన్, కొత్తిమీర, మెంతికూర వంటిని వేసుకొని, అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని సూచిస్తున్నారు. ఆయిల్ మొక్కలు నాటిన నాలుగేళ్ల తర్వాత దిగుబడి వస్తుందని, అప్పటి వరకు అంతర పంటలతో జలసిరులు పొందవచ్చని స్పష్టం చేస్తున్నారు.

రైతు వద్దకే కంపెనీలు



మహేశ్వరం, కందుకూరు మండలాల్లో ఆయిల్ పామ్ సాగుకు అనువైన నేలలున్నాయి. ఆసక్తి ఉన్న రైతులకు ప్రభుత్వం.. మొక్కలు, సాగు పరికరాలు, ఎరువులను భారీ రాయితీతో అందజేస్తుంది. ప్రస్తుతం ఇరు ప్రాంతాల్లో 47 మంది.. సుమారు 300 ఎకరాల్లో పండిస్తున్నారు. పంట కాపునకు వచ్చిన తరువాత ఏటా ఆదాయం పొందవచ్చు. పంటను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కంపెనీలు నేరుగా రైతుల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తాయి.

– సౌమ్య, ఉద్యాన శాఖ అధికారి, మహేశ్వరం



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, పంచాయతీ కార్మికులు

సమ్మెను జయప్రదం చేయాలి

కందుకూరు: జులై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ కోరారు. శుక్రవారం ఎంపీడీఓ సరితకు గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగభద్రత కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కారోబార్లు బాల్‌రాజ్‌గౌడ్, సిద్ధూ, ముత్యాలు, యాదయ్య, పంచాయతీ కార్మికులు రాములు, చెన్నమ్మ, రాధ, సత్తమ్మ, సుగుణమ్మ, అంజమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

అవేర్ సేవలు అభినందనీయం

మహేశ్వరం మాజీ సర్పంచ్ ప్రియాంక

మహేశ్వరం: అవేర్ సంస్థ సేవలు అభినందనీయమని మహేశ్వరం మాజీ సర్పంచ్ ప్రియాంక అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో అవేర్ సంస్థ ఆధ్వర్యంలో మాధవన్‌జీ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ.. గ్రామాల్లో, గిరిజన తండాల్లో నిర్వహిస్తున్న శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. వాకింగ్, యోగా, ధ్యానం, వ్యాయామం అలవర్చుకోవాలన్నారు. వైద్య శిబిరంలో 133 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు పి.సుదర్శన్, బీజేపీ నాయకులు శ్రవణ్, పంచాయతీ కార్యదర్శి సుజాత, అవేర్ సంస్థ కార్యానిర్వహక అధికారి వెంకన్న, వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మహేశ్వరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు



అమ్మవారి సన్నిధిలో భక్తులు

భక్తిశ్రద్ధలతో వారాహి అమ్మవారి నవరాత్రులు

మీర్‌పేట: వారాహి అమ్మవారి నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం మీర్‌పేటలోని కాశీ నర్మదేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శాకాంబరి దేవి రూపంలో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పశువైద్యులు షైన్‌షేక్, సంధ్యారాణి

కందుకూరు: జంతువుల నుంచి మానవులకు సంక్రమించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు డాక్టర్ షైన్‌షేక్, డాక్టర్ సంధ్యారాణి సూచించారు. ఈనెల 6వ తేదీన నిర్వహించనున్న జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. కుక్కకాటును అశ్రద్ధ చేయవద్దని వెంటనే చికిత్స చేయించుకోవాలన్నారు. జంతువులు కుక్కకాటుకు గురైతే పశువైద్యశాలలో టీకాలు ఇప్పించాలన్నారు. జంతువుల నుంచి వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.అంజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కందుకూరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యులు తదితరులు

యువతకు ఆదర్శం దొడ్డి కొమురయ్య

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో కురుమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు నిర్వహించారు. దొడ్డి కురుమ సంఘం బాలాపూర్ మండలం అధ్యక్షుడు ఇక్కె సత్యనారాయణ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దాల దశరథ, కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిష్టగోని సదానందం హాజరయ్యారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని గుర్తు చేశారు. నేటి యువత దొడ్డి కొమురయ్య ధైర్య సాహసాలను అందిపుచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో కురుమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి దొడ్డి మల్లిఖార్జున, వెంకటేశ్వర్, శ్రీనివాస్, రమేష్, దేవరించి వెంకటేష్, రవి, బలవంత్, మల్లేష్, శ్రీశైలం, సత్తయ్య, సంజీవ, జోరల ప్రభాకర్, శ్రీకాంత్ తదితరులున్నారు.

ఆశయ సాధన కృషి

మీర్‌పేట: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కురుమ సంఘం మీర్‌పేట అధ్యక్షుడు సిద్దాల మహేశ్ సూచించారు. కొమురయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం చందన చెరువు కట్టపై ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీరప్ప, శ్రీశైలం, ధన్‌రాజ్, అంజయ్య, బాలరాజు, రమేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.



బడంగ్‌పేట్: దొడ్డి కొమురయ్య వర్ధంతిలో కురుమ సంఘం నాయకులు



మీర్‌పేటలో..

ఏఓ వెంకటేశంకు పదోన్నతి



షాబాద్: మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశంకు ఏడీఏగా పదోన్నతి లభించింది. ఆరున్నర సంవత్సరాలుగా మండల వ్యవసాయ శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశంకు వికారాబాద్ ఏడీఏగా పదోన్నతి రావడంతో షాబాద్ నుండి వికారాబాద్‌కు వెళ్లారు.

సమర భేరికి తరలిన కాంగ్రెస్ నేతలు



జెండా ఊపి బస్సు ర్యాలీని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ తదితరులు

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్బీస్టేడియంలో 'కాంగ్రెస్ న్యాయ సమర భేరి'కి ఆ పార్టీ మహేశ్వరం మండల పరిధి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి నాయకత్వంలో మహేశ్వరం, సుభాన్‌పూర్, మన్సాన్‌పల్లి, సిరిగిరిపురం, గంగారం, పెండ్యాల, కల్వకోల్, కోళ్లపడకల్, ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి, దుబ్బచర్ల, అమీర్‌పేట్, నాగారం, గొల్లూరు, ఎన్డీతండా, కేసీతండా, పెద్దమ్మతండా, పడమటితండాల నుంచి వాహనాల్లో సభకు వెళ్లారు. వెళ్లిన వారిలో మాజీ ఎంపీపీలు రఘుమారెడ్డి, సునీతా, పాండు నాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య, పార్టీ నాయకులు ఈశ్వర్, యాదయ్య, మల్లేశ్ రాజు నాయక్, రాఘవేందర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, మహ్మద్ అదిల్, ఇర్షాద్, నర్సింహ, దశరథ, పాండు నాయక్, దేవేందర్ నాయక్ తదితరులు ఉన్నారు.

సర్కార్ బడులు.. శిథిల భవనాలు



కొందుర్గు బాలికల ప్రాథమికోన్నత పాఠశాల భవనం దుస్థితి

- కురుస్తున్న గోడలు.. పెచ్చులూడుతున్న స్లాబులు
- బడికి పంపేందుకు జంకుతున్న తల్లిదండ్రులు
- పట్టించుకోని అధికారులు

కొందుర్గు: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. మాడల్ స్కూల్స్, ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దుతున్నాం.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నాం అంటూ ఓ వైపు సర్కార్ చెబుతున్నా.. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో ప్రభుత్వ పాఠశాల్లో మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. వసతులు లేమితో పాటు పాఠశాల భవనాలు, విద్యాబోధన చేయడానికి ఉపాధ్యాయులు సరిపడా లేరని ఆయాగ్రామాల ప్రజలు వాపోతున్నారు. కొందుర్గు మండలంలో 23 ప్రాథమిక, ఏడు ప్రాథమికోన్నత, రెండు ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో దాదాపు 2 వేల పైనే విద్యార్థులున్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 28 ప్రాథమిక, ఏడు ప్రాథమికోన్నత, నాలుగు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు 2,500 మంది విద్యార్థులున్నారు.

ఎప్పుడు కూలిపడుతాయో..

చాల గ్రామాల్లో పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలిపడుతాయో అనే చందంగా మారాయి. కొందుర్గు మండల కేంద్రంలోని బాలికల ప్రాథమికోన్నత పాఠశాల, రామచంద్రాపూర్, లాలపేట, ఆగిర్యాల, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని చేగిరెడ్డి ఘనాపూర్, ఎల్కగూడ, తూంపల్లి, పద్మారం, పీర్జాపూర్, గుంజల్‌పహాడ్, చలివేంద్రంపల్లి, వీరసముద్రం, రావిర్యాల పాఠశాలల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. తంగెళ్లపల్లి దళితవాడ, రాంజాతండా పాఠశాలలకు భవనాలే లేవు.



రామచంద్రాపూర్‌లో గదులు లేక వరండాలో బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

అధికారులకు తెలిపాం

పాఠశాల శిథిలావస్థకు చేరిన విషయం అధికారులకు పలుమార్లు చెప్పాం. ఇటీవల కురిసిన వర్షాలకు మా పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడి పడిపోతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నాం. విద్యార్థులపై శిథిలాలు పడితే ప్రమాదాలు తప్పవు.

– రాములమ్మ, హెచ్ఎం, యూపీఎస్, రామచంద్రాపూర్

నిధులున్నా.. పనులు సున్నా!



వినాయకహిల్స్ కాలనీలో రోడ్డు నంబర్-8 దుస్థితి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 5వ డివిజన్‌లో రోడ్లు లేక కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఎన్ని మార్లు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. 5వ డివిజన్‌లోని వినాయకహిల్స్ కాలనీలోని రోడ్డు నెంబర్ 7,8లలో సీసీ రోడ్ల నిర్మాణానికి కౌన్సిల్ తీర్మానం చేసి రూ.30 లక్షలు కేటాయించారు. ఆన్‌లైన్ టెండర్లు ఓపెన్ చేయడంతో ఓ గుత్తేదారు రోడ్డు పనుల టెండర్లు దక్కించుకున్నాడు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నిధులు వెనక్కి వెళ్లె దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా కమిషనర్, డీఈఈలు కలిపించుకుని రోడ్డు పనులు మొదలు పెట్టేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.